● పొత్తుపెట్టుకుంటే అధికారంలో భాగస్వామ్యం ● ఎక్స్‌ట్రా లగేజీగా రాలేదు బ్రో! ● డీసెంట్ అప్రోచ్, డీసెంట్ అటాక్

● విక్రవాండి మహానాడులో టీవీకే నేత విజయ్

వేర్పాటువాదం, అవినీతే మన బద్ధ శత్రువులు



చెన్నై, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తమిళ వెట్రి కళగం పార్టీకి వేర్పాటువాదం, అవినీతే బద్ధశత్రువులని, ఆ రెండింటి నుంచి ప్రజలను కాపాడటమే తన ప్రధాన కర్తవ్యమని ఆ పార్టీ నేత, సినీ నటుడు విజయ్ అన్నారు. విల్లుపురం జిల్లా విక్రవాండి సమీపం వి.సాలై వద్ద ఆదివారం సాయంత్రం బ్రహ్మాండంగా నిర్వహించిన పార్టీ తొలి మహానాడులో ఆయన ఉద్వేగంగా ప్రసంగిస్తూ... 2026 శాసనసభ ఎన్నికల్లో ఘనవిజయం సాధిస్తామని, తమతో పొత్తుపెట్టుకునే పార్టీకి అధికారంలో భాగస్వామ్యం కల్పించి సంకీర్ణ ప్రభుత్వాన్ని నడుపుతామని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలతోపాటు మరొక పార్టీ లేదా ఎక్స్‌ట్రా లగేజీలా తాను పార్టీని ప్రారంభించలేదని, సినీ రంగంలో తనను ఉన్నత స్థానానికి తీసుకెళ్ళిన ప్రజలకు సేవలు చేయడానికే వచ్చానన్నారు. భయం లేకుండా పసిబిడ్డ చేత్తో పాము పట్టుకుంటుంది.. ఇక్కడా ఆ పామే రాజకీయం.. దానిని చేతపట్టుకుని ఆటలాడే పసిబిడ్డ నేనే.. రాజకీయాలకు మనం పసిబిడ్డలవంటివారమనేది ప్రత్యర్థుల కామెంట్, పాములాగా ఉన్నా మాకు భయమే లేదన్నదే మా కాన్ఫిడెంట్, పసితనం భయం ఎరుగదు అనేరీతిలో రాజకీయాలనే పాము పట్టుకుని కాస్త సీరియస్‌గా, కొంచెం హాస్యంతో ఆటలాడటమే నా రూట్ అంటూ విజయ్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఇప్పటి వరకూ ఆడియోలాంచ్ సభల్లోనే కలిశాం. తొలిసారిగా రాజకీయ వేదికపై కలుసుకుంటున్నామన్నారు. ఇప్పటి వరకూ శాస్త్ర సాంకేతిక రంగాలలోనే మార్పులు వచ్చాయని, ఆ రీతిలోనే రాజకీయాల్లో సరికొత్త మార్పులు తీసుకురావాలన్నదే తన ధ్యేయమన్నారు. భావితరాల గురించి, వారికి మనం కల్పించాల్సిన సదుపాయాలు గురించి ఆలోచించాలి. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న రాజకీయ నేతలు గురించి మాట్లాడి కాలయాపన చేయదలచుకోలేదన్నారు.

ఆ ముగ్గురు నేతలే ఆదర్శం..

ద్రవిడ ఉద్యమ నేత పెరియార్, మాజీ ముఖ్యమంత్రులు అన్నాదురై, కామరాజర్ తమ పార్టీ ఆదర్శమూర్తులని అదే విధంగా భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలు, స్వాతంత్ర్య సమరయోధులు వేలునాచ్చియార్. కడలూరు అంజలై అమ్మాళ్ ఆశయాలు ఆచరించడమే తన ప్రధాన కర్తవ్యమన్నారు. పెరియార్ తనకు ఆదర్శమని చెబితే రాష్ట్రంలో పెయింట్ డబ్బాలు పట్టుకుని తనవెంట ఓ గుంపు వచ్చేస్తుందంటూ బీజీపీపై పరోక్షంగా విమర్శించారు. దేవుడు లేడనే పెరియార్ నాస్తికవాదాన్ని తమ పార్టీ ఆదర్శంగా తీసుకోదని, ఆయన సూచించిన మహిళాభ్యుదయం, ఆత్మగౌరం, సామాజిక న్యాయం అనే సూత్రాలనే పాటిస్తామన్నారు.

నీట్‌కు వ్యతిరేకంగా పోరాటం..

నీట్‌కు వ్యతిరేకంగా పోరాడేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, నీట్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న సోదరి అనితా సంఘటన తనను మనస్సును కలచివేసిందని, చిన్నప్పుడు తన చెల్లి దివ్య మృతి చెందినప్పుడు ఎలా బాధపడ్డానో అంతకంటే ఎక్కువగా అనిత మృతి బాధపెట్టిందన్నారు.

శత్రువులుంటేనే అసలైన విజయం..

నేనొక్కడే బాగుండాలి అనుకోవటం స్వార్థం.. కనుకనే తనను ఉన్నతస్థితికి తీసుకెళ్లిన ప్రజలకు మేలు చేయాలనుకున్నాని, మార్గమేమిటా ఆలోచిస్తే రాజకీయం అనే వేదిక అనువైనదని ఎంచుకున్నానని, రాజకీయ ప్రవేశం చేయగానే తమ శత్రువులు ఎక్కడున్నారంటూ వెదుక్కుని వెళ్ళాల్సిన అవసరం లేదని, శత్రువులే మన ఎదుట నిలుస్తారని చెప్పారు.

పార్టీ విజయాన్ని తీర్మానించేది శత్రువులేనని చెప్పటం అతిశయోక్తి కాదన్నారు. ప్రస్తుతానికి తమ పార్టీకి వేర్పాటు వాదం, అవినీతి అనే రెండు శత్రువులు ఎదరవుతున్నాయని, వేర్పాటు వాదులెవరో సులువుగా కనుగొనగలమని, అయితే అవినీతి ఏ రూపంలో ఏ చోట దాగి ఉంటుందో ఎవరూ కనుగొనలేదని, ఆ అవినీతిపై పోరు సాగిస్తానన్నారు.

మాటలు కాదు చేతలే ముఖ్యం..

పార్టీ శ్రేణులంతా పార్టీ సిద్ధాంతాలను ఆచరిస్తూ ప్రజలలో విస్తృత ప్రచారం చేయాలన్నారు. అందరూ చెబుతున్నట్లు చేపలు తినిపించడం కాదు. చేపలు పట్టడం నేర్పిస్తామంటూ సొల్లు కబుర్లు చెప్పే పార్టీల కంటే భిన్నంగా తమ పార్టీ చేపలపట్టడం నేర్పడమే కాకుండా చేపలు వారికి తినిపిస్తుందన్నారు. మిగతా పార్టీలలాగా ప్రత్యామ్నాయ రాజకీయాలంటూ ప్రజలను ఏమార్చడానికి రాలేదని, ఉన్న పార్టీల్లాగా ఎక్స్‌ట్రా లగేజీగా రాలేదు బ్రో (బ్రదర్) అంటూ ఆయన స్పష్టం చేశారు. తమ పార్టీ ఇప్పుడున్న పార్టీల్లా కొల్లగొట్టే పార్టీ కాదని, పక్కా ప్లాన్‌తో పబ్లిక్ ఇంట్రెస్ట్‌తోనే రాజకీయ ప్రవేశం చేశానని స్పష్టం చేశారు.

ఈ మహానాడు తర్వాత తమ పార్టీని వేరేపార్టీల ఏ టీమ్ బీ టీమ్ అంటూ రాబోయే విమర్శలను కూడా పట్టించుకోకూడదన్నారు.

టీవీకే మహానాడు ప్రతిజ్ఞ...

మహానాడు ప్రారంభంలో తమిళతల్లి ప్రార్థన అనంతరం పార్టీ కోశాధికారి వెంకట్రామన్ పార్టీ నేతలందరితో ప్రతిజ్ఞ చేయించారు. దేశ విముక్తి కోసం, ప్రజాహక్కుల కోసం తమిళ సీమలో వీరమరణం పొందిన అసంఖ్యాక వీరుల త్యాగాలను ఎప్పటికీ గౌరవిస్తాను. మాతృమూర్తి, మాతృభాషను కాపాడుకోవడానికి తమ ప్రాణాలను త్యాగం చేసిన భాషోద్యమ వీరుల లక్ష్యాన్ని నెరవేర్చేందుకు నిరంతరం పాటుపడతాను.. భారతరాజ్యాంగం, దేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షిస్తాను. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయమార్గాల్లో పయనిస్తాను.. ప్రజాసేవకుడిగా సేవలందిస్తాను.. కులం, మత బేధాలను తొలగించి అందరికీ సమాన అవకాశాలు, సమాన హక్కులు కల్పించేందుకు కృషిచేస్తాను.. అంటూ ఆ ప్రతిజ్ఞలో పేర్కొన్నారు.

'కూత్తాడి'లే చరిత్ర సృష్టించారు..

తాను రాజకీయ ప్రవేశం గురించి ప్రకటన చేయగానే కొన్ని పార్టీల నేతలు 'కూత్తాడి' (వీధిబాగోతాలాడే వ్యక్తి, సినిమాల్లో వేషాలేసేవాడు) అంటూ యెద్దేవా చేశారని, కూత్తాడి అంటే వారికి అంత కోపమెందుకో తెలియటం లేదని, సినీ రంగానికి చెందిన ఎంజీఆర్, ఎన్టీఆర్ రాజకీయాల్లో చరిత్ర సృష్టించారనే విషయం వారికి గుర్తులేకపోవడం గర్హనీయమని విజయ్ అన్నారు. ద్రావిడ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లింది కూత్తాడిలే (నటులే)నన్న విషయాన్ని కూడా ఆ పార్టీలు మరచిపోయాయన్నారు. కూత్తాడి కోపాన్ని ఎవరూ గుర్తించలేరని, ఆ రీతిలో తనకున్న కోపాన్ని కూడా గుర్తించటం కష్టసాధ్యమన్నారు. తన ప్రసంగం చివరలో సంఘ సాహిత్యంలో పాండియర్ అనే యువరాజు కథ చెప్పి ముగించారు. ఓ రాజ్యంలో యుద్ధం వచ్చిందని, ఓ చిన్న బాలుడు యుద్ధానికి వెళ్తానంటే పెద్దలు వద్దన్నారని, అయితే ఆ బాలవీరుడు కదనరంగంలో తన యుద్ధనైపుణ్యాన్ని ప్రదర్శించి అందరి మెప్పు పొందాడని, ఆ రీతిలోనే రాజకీయాలకు తాను పసిబిడ్డ వంటివాడినే అయినా రాజకీయ కదన రంగంలో గెలిచి తీరుతాననన్నారు. ఇక ఈ సభలో తాను రాష్ట్రంలో రాజకీయ నేతల గురించి పల్లెత్తు మాట చెప్పకపోవడాన్ని ప్రస్తావిస్తూ ఆ రాజకీయ నేతల పేర్లను చెప్పడానికి తనకెలాంటి భయం లేదని, అయితే వారిపేర్లను చెప్పి వారిని ఘాటైన పదజాలంతో విమర్శలు చేయడానికి రాలేదని, డీసెంట్ అప్రోచ్, డీసెంట్ అటాక్ తన బాణీ అని చెప్పారు.

తల్లిదండ్రుల ఆశీస్సులు..

మహానాడులో టీవీకే నేత విజయ్ ప్రసంగించడానికి ముందు వేదిక ముందువరుసలో కూర్చున్న తల్లిదండ్రులు శోభ, ఎస్వీ చంద్రశేఖర్ వద్దకు వెళ్ళి వారి ఆశీస్సులను అందుకున్నారు. విజయ్‌ని ఆయన తండ్రి చంద్రశేఖర్ కౌగలించుకుని అభినందించారు. ఆ తర్వాతే ఆయన వేదికపైకెక్కి తన ప్రసంగాన్ని ఉద్వేగంగా ప్రసంగించారు.

టీవీకే లక్ష్యాలు....సిద్ధాంతాలు

ప్యారీస్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండి సమీపంలోని వి.శాలైలో ఆదివారం జరిగిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) లక్ష్యాలు, సిద్ధాంతాలను ప్రొఫెసర్ సంపత్‌కుమార్ ప్రకటించారు. అలాగే, మొత్తం 19 తీర్మానాలను ఈ మహానాడు ఏకగ్రీవంగా ఆమోదించింది.

- టీవీకే పాలనలో రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు
- కుల, మత, లింగ వివక్ష లేకుండా మతసామరస్యం పెంపొందించేలా ప్రభుత్వ పనితీరు
- ఎమ్మెల్యేలు, మంత్రుల పనితీరు క్రమబద్ధీకరణ
- మదురైలో సచివాలయ శాఖ ప్రారంభం
- రాష్ట్రంలో అధికార భాషగా తమిళం
- న్యాయస్థానాల్లో తమిళంలోనే వాదనలు, తీర్పులు
- తమిళ మీడియంలో పరిశోధన విద్య, తమిళ మీడియంలో చదువుకున్న వారికి ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత
- కీళడి తదితర ప్రాంతాల్లో పురావస్తు శాఖ చేపట్టే పరిశోధనలు, తవ్వకాలకు ప్రాధాన్యత
- కులాల వారీగా జనగణన
- గవర్నర్ పదవి తొలగింపు
- అన్ని జిల్లాల్లో కామరాజర్ ఆదర్శ పాఠశాలలు
- మహిళలకు అసెంబ్లీ, పార్టీలో పదవులు
- కర్మాగారాల క్రమబద్ధీకరణ
- పక్షులు, వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక పథకం
- వాతావరణాన్ని సంరక్షించేలా అడవుల విస్తీర్ణ పథకం
- ఇసుక, గ్రానైట్ క్వారీల్లో మోసాలకు అడ్డుకట్ట
- ఇసుక మాఫియా నివారణకు ప్రత్యేక చట్టం
- క్యాన్సర్ వ్యాధి నివారణకు అన్ని జిల్లాల్లో ఆస్పత్రులు
- రైతులకు న్యాయం చేకూర్చేలా ప్రతి సీజన్‌లో గిట్టుబాటు ధర
- గీత కార్మికుల ఆర్థిక వ్యవస్థ మెరుగుపరిచేలా జాతీయ పానీయంగా పదనీర్
- నేత కార్మికుల సంక్షేమార్థం వారంలో ప్రభుత్వ ఉద్యోగులు రెండు రోజులు ఖద్దరు దుస్తులు ధరించేలా చర్యలు
- నేత కార్మికులచే పారిశుధ్య కార్మికుల యూనిఫాం తయారీ
- విద్యను ఉమ్మడి జాబితాలో చేర్చకుండా రాష్ట్ర జాబితాలో చేర్చేలా చర్యలు
- టీవీకే పాలనలో ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రజల వద్దకే సేవలు
- లింగ, కుల, మత భాషలకు అతీతంగా అన్ని వర్గాలకు సమన్యాయం
- రాష్ట్ర నైతిక హక్కులు కాపాడడంతో పాటు ప్రజలకు న్యాయం చేయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయడం
- మాదకద్రవ్యాలు, మద్యం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడం
- నిష్పత్తుల వారీగా రిజర్వేషన్ కేటాయింపు
- సనాతన, వర్ణాశ్రమం ఏ రూపంలో వచ్చినా వ్యతిరేకిస్తాం.



ర్యాంప్‌పై నుంచి కార్యకర్తలకు అభివాదం చేస్తున్న విజయ్

ప్రతి నియోజకవర్గంలో కలైంజర్ గ్రంథాలయాలు

● డిప్యూటీ సీఎం ఉదయనిధి ● విజయ్‌కు శుభాకాంక్షలు

అడయార్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలైంజర్ గ్రంథాలయాలను నెలకొల్పుతామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఉదయనిధి వెల్లడించారు. డీఎంకే యువజన విభాగం ఆధ్వర్యంలో 'కలైంజర్ శతజయంతి వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన వక్తృత్వ పోటీ విజేతలకు ఆయన ఆదివారం బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మరో మూడు నెలల్లో అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో కలైంజర్ పేరుతో లైబ్రరీలను నెలకొల్పుతామన్నారు. ఇప్పటివరు 75 నియోజకవర్గాల్లో ఈ గ్రంథాలయాలను నెలకొల్పినట్టు చెప్పారు. వక్తృత్వ పోటీలను మొక్కుబడిగా నిర్వహించడం లేదని, విద్యార్థులకు అన్ని విధాలుగా ఉపయోగపడేలా నిర్వహిస్తున్నామన్నారు. 47 ప్రాంతాల్లో జిల్లా స్థాయి పోటీలను యువజన విభాగం ఇచ్చిన పది అంశాలతో వీటిని నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకోసం 85 మంది న్యాయనిర్ణేతలను నియమించామన్నారు. ఈ పోటీల్లో సరైన వాగ్ధాటివున్న వారిని ఎంపిక చేసి పార్టీ అధినేతకు అప్పగిస్తామన్నారు. ఇప్పటివరకు ఈ పోటీల్లో పాల్గొన్న 913 మందిలో 182 మందిని ఎంపిక చేసి జాబితా అప్పగించారన్నారు. కాగా, ఈ పోటీల్లో తొలి బహుమతిని నామక్కల్ జిల్లాకు చెందిన మోహనిధి, రెండో బహుమతి చెంగల్పట్టు శివరంజని, మూడో బహుమతి విశ్వ అందుకున్నారు.

హీరో విజయ్‌కు విషెస్

తమిళగ వెట్రి కళగం పేరుతో కొత్త రాజకీయ పార్టీని స్థాపించి ఆదివారం తొలి మహానాడును నిర్వహించిన సినీ హీరో విజయ్‌కు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి శుభాకాంక్షలు తెలిపారు. ఇదే విషయంపై ఆయన మాట్లాడుతూ, విజయ్, తాను ఎంతో కాలంగా స్నేహితులం. చిన్నప్పటి నుంచే విజయ్ తనకు బాగా తెలుసు. ప్రజాసేవే ముఖ్యమన్న ఉదయనిధి విజయ్ కొత్త పార్టీకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

నేటినుంచి దీపావళి ప్రత్యేక బస్సులు

● కిలంబాక్కంలో ప్రత్యేక ఏర్పాట్లు ● పరిశీలించిన మంత్రులు

ప్యారీస్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ కోసం సొంతూళ్లకు వెళ్లే వారి కోసం రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థలు సోమవారం నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నాయి. కిలంబాక్కంలో అత్యాధునిక వసతులతో ఇటీవల ప్రారంభించిన బస్ టెర్మినల్‌లో వసతులను ఆదివారం రాష్ట్ర మంత్రులు పీకే శేఖర్‌బాబు, ఎస్ఎస్ శివశంకర్ పరిశీలించారు. ఈ బస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆస్పత్రి, రవాణా సంస్థల బుకింగ్ కౌంటర్లు, కొత్తగా నిర్మిస్తున్న పోలీస్‌స్టేషన్, ప్రయాణికులకు కల్పించిన వసతులు, దూరప్రాంతాలకు నడుపుతున్న బస్సుల వివరాలు తదితరాలను మంత్రులు పరిశీలించారు. ఈ సందర్భంగా రవాణా శాఖ మంత్రి శివశంకర్ మీడియాతో మాట్లాడుతూ... కిలంబాక్కం బస్‌స్టేషన్‌లో ఉన్న ప్లాట్‌ఫారంలో ఆయా ఊళ్లకు వెళ్లే బస్సుల నెంబర్లతో డిజిటల్ బోర్డులు ఏర్పాటుచేశామని, ప్రయాణికుల రద్దీని బట్టి పండుగ సీజన్‌లో అదనపు బస్సులు నడిపేందుకు చర్యలు చేపడతామన్నారు. నగరం నుంచి మామూలుగా నడుపుతున్న 3,408 బస్సులతో పాటు దీపావళి కోసం మరో 4,250 బస్సులు, 2,000లకు పైగా ఆమ్నీ బస్సులు సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. పండుగల సీజన్‌లో ఇంతకుముందు కోయంబేడు బస్ టెర్మినల్‌కు నగరంలోని పలు ప్రాంతాల నుంచి ఎంటీసీ బస్సులు నడుపుతున్నట్లే, ఈసారి కిలంబాక్కంకు 5 నిమిషాలకు ఒక ఎంటీసీ బస్సు నడిపేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రయాణికుల రద్దీని ఆసరాగా తీసుకొని పండుగ రోజుల్లో అదనపు ఛార్జీలు వసూలుచేసే ఆమ్నీ బస్సులు, అలాగే ప్రైవేటు వాహనాలపై తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి శివశంకర్ హెచ్చరించారు.



కిలంబాక్కం బస్‌టెర్మినల్ వద్ద మంత్రులు పీకే శేఖర్‌బాబు, శివశంకర్, అధికారులు



శ్రీవారి ఆలయంలో అప్పలనాయుడు, ఎం.చలపతి, ఎం.రవీంద్రబాబు, జనార్ధన్ తదితరులు



విజయనగరం ఎంపీతో చెన్నై టీడీపీ నేతలు

చెన్నైలోని తెలుగువారంతా టీడీపీ సభ్యత్వం తీసుకోవాలి

● 'ఆత్మీయ సమావేశం'లో ఎంపీ కలిశెట్టి పిలుపు

అడయార్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): చెన్నై మహానగరంలోని తెలుగు వారంతా తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం టీడీపీ లోక్‌సభ సభ్యుడు, ఐటీ, కమ్యూనికేషన్ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ఆయన ఎంపీగా ఎన్నికైన తరువాత ఆదివారం తొలిసారిగా నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా టి.నగర్‌లోని ఆంధ్రా క్లబ్‌లో తెలుగు వారితో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. తెలుగు ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా టీడీపీ తక్షణం స్పందించి, అండగా నిలుస్తుందన్నారు. సుమారుగా 40 శాతం తెలుగు ప్రజలు ఇక్కడ ఉన్నారనీ, వీరిలో మెజారిటీవారు టీడీపీ సభ్యత్వం తీసుకోవడం వల్ల పార్టీతో పాటు ప్రజలకు మరింత సన్నిహితంగా ఉండేందుకు, వారి సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు అవకాశాలుంటాయని ఆయన పేర్కొన్నారు. శాశ్వత సభ్యతం ప్రతి తెలుగు వ్యక్తికి పార్టీ మీద భరోసాను కల్పిస్తుందని అభిప్రాయపడ్డారు. తాజాగా అండమాన్ నికోబార్ దీవుల్లో కూడా టీడీపీ నాయకత్వం ప్రజలకు అండగా నిలబడటం జరిగిందని అప్పల నాయుడు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్కా మాజీ అధ్యక్షుడు ఆదిశేషయ్య, టీడీపీ నేతలు జనార్ధన్, ఎం.చలపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ సందర్శన..

అంతకుముందు ఎంపీ అప్పలనాయుడు టి.నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయానికి విచ్చేసి శ్రీవారిని దర్శనం చేసుకున్నారు. ఎంపీగా విజయం సాధించిన తర్వాత తొలిసారి నగరానికి వచ్చిన అప్పలనాయుడు శ్రీవారి ఆలయానికి రాగా, ఆయనకు టీటీడీ చెన్నై సమాచార కేంద్ర సలహా మండలి మాజీ సభ్యులు ఎం.చలపతి, ఎం.రవిబాబు, టీడీపీ నేత జనార్ధన్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ అప్పలనాయుడుకి శ్రీవారి ప్రసాదాలను వేదపండితులు అందజేశారు.

సమాచార దర్శిని

31 వరకు కర్మాగారాల లైసెన్స్ రెన్యువల్‌కు అవకాశం

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లైసెన్స్ పొందిన కర్మాగారాలు 2025 సంవత్సరం లైసెన్స్ రెన్యువల్‌కు ఈ నెల 31వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ ప్రకారం, ఫారం02 సమర్పించిన తర్వాత అప్‌డేట్ చేయబడిన కర్మాగారం లైసెన్స్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కర్మాగారాల యజమానులు ీటీటీ.చీజీట్ఖ్ఖి.జొ౦ఖి.జీ అనే వెబ్‌సైట్ ద్వారా లైసెన్స్ రెన్యువల్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

ఐఐటీ మద్రాసులో 'ఏవియేషన్ సేఫ్టీ మేనేజ్‌మెంట్' కోర్సు

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ మద్రాసు, ప్రవర్తక్, ఫ్రెంచి యూనివర్సిటీతో కలసి 'ఏవియేషన్ సేఫ్టీ మేనేజ్‌మెంట్' కోర్సు పరిచయం చేసింది. ఈ కోర్సు వ్యవధి రెండు సంవత్సరాలు కాగా, నెలలో ఐదు రోజులు ప్రత్యక్ష తరగతులు, ఇతర రోజుల్లో ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఎయిర్‌లైన్స్‌లో పనిచేస్తున్న వారు ఈ కోర్సులో చేరవచ్చు. ఈ కోర్సు చేసేందుకు ఫ్రాన్స్ వెళ్లి రూ.12 లక్షల ఫీజు చెల్లిస్తున్న నేపథ్యంలో, మద్రాసు హైకోర్టు చొరవతో ఢిల్లీలో చదివే అవకాశం లభించింది. వచ్చే ఏడాది జనవరిలో 30 మందితో ప్రారంభం కానున్న ఈ కోర్సులో చేరగోరువారు డిసెంబరు 15వ తేదిలోపు https://digitalski-lla.iitm-pravartak.org.in/course_details.php?courseID=285&cart అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు dsa@iitmpravartak.net సంప్రదించవచ్చు.

సబర్బన్ రైళ్లలో ఏసీ బోగీలు

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో నడుపుతున్న సబర్బన్ రైళ్లకు ఏసీ బోగీలు అనుసంధానం చేయనున్నారు. ప్రస్తుతం నడుపుతున్న సబర్బన్ రైళ్లలో తలా రెండు మహిళల బోగీలు, ఫస్ట్ క్లాస్ బోగీలున్నాయి. దూరప్రాంతాలకు నడిపే సబర్బన్ రైళ్లలో ఏసీ బోగీలు అనుసంధానం చేయాలని ప్రయాణికులు దక్షిణ రైల్వేకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆ మేరకు సబర్బన్ రైళ్లకు ఏసీ బోగీలు అనుసంధానం కానున్నాయి. ఇందుకోసం పెరంబూర్ ఐసీఎఫ్‌లో ఏసీ బోగీల తయారీ జరుగుతోంది. వచ్చే నెలలో ఒక్కో రైలుకు ఏసీ బోగీ అనుసంధానం చేసిన ట్రయల్ రన్ నిర్వహించనున్నామని, జనవరి నుంచి అన్ని రైళ్లకు ఏసీ బోగీలు ఏర్పాటుచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

హొగెనేకల్‌లో దోనెల సవారీకి అనుమతి

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జిల్లా హొగెనేకల్ జలపాతాల వద్ద దోనెల సవారీకి జిల్లా యంత్రాంగం అనుమతించింది. కావేరి పరివాహక ప్రాంతాల్లో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా హొగెనేకల్ జలపాతాల వద్ద వరద ఉధృతి అధికంగా ఉండడంతో దోనెల సవారీ రద్దు చేశారు. ఈ క్రమంలో, 14 రోజుల అనంతరం ఆదివారం హొగెనేకల్ జలపాతాల వద్ద వరద ఉధృతి తగ్గడంతో దోనెల సవారీకి అనుమతించారు. ఆదివారం సెలవు దినం కావడంతో భారీగా వచ్చిన పర్యాటకులు ఆనందంగా దోనెల సవారీలో పాల్గొన్నారు.

కుత్రాలంలో స్నానాలకు అనుమతి

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం కుత్రాలం జలపాతం వద్దకు పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. సెలవు రోజులు, విశేష దినాల్లో పర్యాటకుల సంఖ్య అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో పశ్చిమ కనుమల కొండ ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తుండడంతో జలపాతం వద్ద వరద ఉధృతి అధికమైంది. దీంతో జలపాతాల వద్ద పర్యాటకుల స్నానాలకు అటవీ శాఖ నిషేధం విధించింది. ఈ క్రమంలో, జలపాతం వద్ద నీటి ఉధృతి తగ్గుముఖం పట్టడంతో ఆదివారం నుంచి పర్యాటకులను అనుమతించారు.

నేటినుంచి బీఎడ్ ఫస్టియర్ తరగతులు

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరం బీఎడ్ మొదటి సంవత్సరం తరగతులు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో 900 సీట్లు, 14 ఎయిడ్ పాఠశాలల్లో 1,140 బీఎడ్ సీట్లున్నాయి. ఈ సీట్లకు 3,486 మంది దరఖాస్తు చేసుకోగా, 2,187 మంది మాత్రమే దరఖాస్తు రుసుము చెల్లించారు. సెప్టెంబరు 30న ర్యాంకుల జాబితా విడుదల చేసి, ఈ నెల 14 నుంచి 22వ తేది వరకు రాణి వెల్లింగ్టన్ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహించగా, 1,500 సీట్లు భర్తీ అయ్యాయి. ఈ క్రమంలో, బీఎడ్ మొదటి సంవత్సరం తరగతులు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు.

నంగవల్లి వారపు సంతలో రూ. కోట్లలో విక్రయాలు

ప్యారీస్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకొని సేలం జిల్లా నంగవల్లి వారసంతలో ఆదివారం గొర్రెల విక్రయాలు ఊపందుకున్నాయి. ఈ సంతలో ఉదయం 6 గంటలకు మోచేరి, మెట్టూరు, నంగవల్లి, కారమంగళం, ఓమలూరు తదితర ప్రాంతాల నుంచి 1,000కి పైగా గొర్రెలను వాటి యజమానులు వాహనాల ద్వారా తరలించారు. అదే విధంగా నాటు కోళ్ల విక్రయాలు కూడా జోరుగా సాగాయి. 10 కిలోల గొర్రె రూ.10 వేల నుంచి రూ.14 వేల వరకు విక్రయించారు. సంతలో ఈ ఒక్కరోజు మాత్రమే రూ2 కోట్లకు పైగా గొర్కెలు విక్రయించడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.

బందల్ కుడికాలువకు రూ.90 కోట్లతో ప్రహరీ

● మంత్రి కేఎన్ నెహ్రూ



మదురైలో వరద బాధిత ప్రాంతాలను పరిశీలిస్తున్న మంత్రి కేఎన్ నెహ్రూ

ప్యారీస్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మదురై బందల్‌కుడి కాలువకిరువైపులా రూ.90 కోట్లతో ప్రహరీ నిర్మించనున్నట్లు మంత్రి కేఎన్ నెహ్రూ పేర్కొన్నారు. మదురై పట్టణంలో ఇటీవల కురిసిన భారీవర్షాలకు దెబ్బతిన్న సెల్లూరు కట్టబొమ్మన్ నగర్, బందల్‌కుడి కాలువ ప్రాంతం, చూలమంగళం వీధి తదితర ప్రాంతాలను మంత్రులు కేఎన్ నెహ్రూ, బి.మూర్తి, పళనివేల్ త్యాగరాజన్, మేయర్ ఇంద్రాణి, జిల్లా కలెక్టర్ సంగీత, కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ తదితరులతో కలసి ఆదివారం పరిశీలించారు. అనంతరం మంత్రి నెహ్రూ మీడియాతో మాట్లాడుతూ... ఆలయాల నగరంగా ప్రసిద్ధిగాంచిన మదురైలో వరద నీరు చేరిన 18 నివాస ప్రాంతాల్లో నీటిని పూర్తిస్థాయిలో తొలగించామని, ప్రస్తుతం వీధుల్లో నిలిచిన వరద నీరు డ్రైనేజీల్లో చేరేలా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ప్రధానంగా బందర్‌కుడి కాలువకిరువైపులా ప్రహరీ నిర్మించేందుకు చర్యలు చేపట్టాల్సిందిగా జిల్లా యంత్రాంగానికి ఆదేశించినట్లు తెలిపారు. 1955వ సంవత్సరం అనంతరం మదురైలో ఊహించని విధంగా 15 నిమిషాల వ్యవధిలో 8 సెం.మీ వర్షం కురిసిందని, అయినప్పటికీ స్థానికులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టినందువల్ల పరిస్థితి చక్కబడిందని మంత్రి తెలిపారు.

తెలుగు బ్రాహ్మణ మహాసభ అధ్యక్షుడిగా గోటేటి వెంకటేశ్వరరావు



గోటేటి వెంకటేశ్వరరావు



గోటేటి వెంకటేశ్వరరావుతో టీబీఎం అధ్యక్షుడు కల్య రఘుకుమార్, జయరామన్ తదితరులు

ప్యారీస్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గత నలభై ఏళ్లుగా బ్రాహ్మణ కుటుంబాలకు విద్య, వివాహం, ఉద్యోగ రంగాల్లో విశేష సేవలందిస్తున్న తెలుగు బ్రాహ్మణ మహాసభ (టీబీఎం) 2024-26 సంవత్సరాలకు అధ్యక్షుడిగా గోటేటి వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలో ఆదివారం టీబీఎం అధ్యక్షుడు కల్య రఘుకుమార్ అధ్యక్షతన రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశం కొత్త అధ్యక్షుడితో పాటు ఉపాధ్యక్షులుగా జయరామన్, ప్రభాకర్, కార్యదర్శిగా శంకరం, సహాయ కార్యదర్శిగా సాయినాథ్, కోశాధికారిగా బాలాజీ సహా 9 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా గోటేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... రాజధాని నగరం చెన్నైలో గత 40 ఏళ్లుగా ఆధ్యాత్మిక, సామాజిక సేవల్లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న టీబీఎంకు అధ్యక్షుడిగా ఎన్నుకోబడడం గౌరవంగా భావిస్తున్నానన్నారు. సభ అభివృద్ధికి సమష్టి కృషితో ముందుకు తీసుకెళతామన్నారు. ప్రస్తుత అధ్యక్షుడు రఘుకుమార్ సేవలను కొనియాడుతూ అవి అందరికీ అందేలా కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన



జాబ్ మేళాలో యువకుడికి ఉత్తర్వులు అందజేస్తున్న కేకే త్రినాథ్ కుమార్

ప్యారీస్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఆర్య వైశ్య మహాసభ గ్రేటర్ చెన్నై, ఈక్విటాస్ బ్యాంక్ సంయుక్తంగా ఆదివారం పెరంబూర్‌లోని కలిగి రంగనాథన్ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. టెన్త్, ప్లస్ టూ, డిగ్రీ, డిప్లొమో, ఐటీఐ, బీటెక్ చదువుకున్న 18 నుంచి 35 ఏళ్లలోపు వారి కోసం ఏర్పాటుచేసిన ఈ జాబ్ మేళాలో ఈక్విటాస్, టాటా గ్రూప్, బజాజ్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎంఆఆర్ఎఫ్, ముత్తూట్ ఫైనాన్స్, రిలయన్స్ మై జియో, జైరాజ్ ఇంటర్నేషనల్ తదితర 49 కార్పొరేట్ కంపెనీలు పాల్గొనగా, సుమారు 535 మందికి పైగా అభ్యర్థులు పాల్గొన్నారు. వీరిలో 67 మంది నెలకు రూ.20 వేల నుంచి రూ.70 వేల వేతనంతో పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి మహాసభ గ్రేటర్ చెన్నై అధ్యక్షుడు కేకే త్రినాధ్‌కుమార్ ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దయాలం వాసుదేవన్, ట్రెజరర్ ఎంఎ నరసింహులు, నిర్వాహకులు ఎ.బద్రీనారాయణ, బండారు భాస్కర్, ఎస్వీ పద్మనాభన్, కనమర్లపూడి శ్రీనివాసులు, జీఎస్ సత్యమూర్తి, ప్రాజెక్ట్ చైర్మన్ స్వర్ణ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంకేలో కుటుంబ రాజకీయాలకే ప్రాధాన్యం: ఈపీఎస్



అన్నాడీఎంకే ఆవిర్భావ వేడుకల్లో ప్రసంగిస్తున్న పళనిస్వామి

ప్యారీస్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): డీఎంకేకు ప్రజాస్వామ్యంతో ఎలాంటి సంబంధం లేదని, ఆ పార్టీ కుటుంబ రాజకీయాలను ప్రోత్సహిస్తోందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విమర్శించారు. కాంచీపురంలో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో 53వ పార్టీ ఆవిర్భావ వార్షికోత్సవం సందర్భంగా గాంధీ రోడ్డులో ఆదివారం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో పళనిస్వామి మాట్లాడుతూ... ప్రజాస్వామ్య దేశంలో అన్ని రాష్ట్రాల్లో ఒక్కరు మాత్రమే ముఖ్యమంత్రిగా ఉంటారని అయితే, ఒక తమిళనాడులో మాత్రమే నలుగురు సీఎంలుగా పెత్తనం చెలాయిస్తున్నారని వ్యాఖ్యానించారు. అన్నాడీఎంకేలో సామాన్య కార్యకర్తలు కూడా పార్టీ ఉన్నత పదవులకు ఎంపికవుతారని అయితే, డీఎంకేలో మాత్రం ఒకే కుటుంబానికి చెందిన వారు మాత్రమే ఆ పదవుల్లో ఉంటారన్నారు. ఈ సభలో మాజీ మంత్రులు వలర్మతి, పి.బెంజిమెన్, వి.సోమసుందరం తదితరులు పాల్గొన్నారు.

లాప్‌టాప్ చోరీచేసిన ముగ్గురి అరెస్ట్



వేలూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడిలో లాప్‌టాప్‌ల చోరీ ఘటనలు అధికమవుతున్నాయి. ఈ చోరీలపై కాట్పాడి డీఎస్పీ పళని ఉత్తర్వులతో కాట్పాడి సీఐ ఆనందన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం గస్తీ చేపట్టింది. కాట్పాడి సమీపం అరుమ్‌బుమేడు ప్రాంతంలో వాహన తనిఖీలు చేపట్టగా, ఆ సమయంలో ఒకే స్కూటర్‌పై వచ్చిన ముగ్గురు యువకులను ఆపారు. విచారణలో... కాట్పాడి గాంధీ నగర్‌కు చెందిన మురళి, కాట్పాడి క్రిస్టియన్‌పేట అరుల్‌నగర్‌కు చెందిన కుమరన్, కాట్పాడి అరుప్పుమేడు భవాని నగర్‌కు చెందిన మణికంఠన్ అని, లాప్‌టాప్‌లు దొంగతనం చేస్తుంటారని తెలిసింది. ముగ్గుర్నీ అరెస్ట్ చేసి పోలీసులు వారి నుంచి మూడు లాప్‌టాప్‌లు, ఒక కంప్యూటర్, ఒక స్కూటర్ స్వాధీనం చేసుకొని, వారిని కోర్టులో హాజరుపరచి వేలూరు జైలుకు తరలించారు.

ఆగని లంక నావికాదళ దాడులు

● 12 మంది నాగపట్టినం జాలర్ల అరెస్ట్

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సరిహద్దులు దాటి చేపలు పడుతున్నారని ఆరోపిస్తూ 12 మంది నాగపట్టినం జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసింది. నాగపట్టినం జిల్లా అక్కరైపేట జాలర్ల గ్రామానికి చెందిన సిలంబుసెల్వన్‌కు సొంతమైన ఫైబర్ పడవలో గుణ, సెంజివేల్, వెంకటేశన్, చిన్నఅప్పు, కార్తీ, రఘు సహా 12 మంది శుక్రవారం సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. అర్ధరాత్రి కొడియక్కరైకి ఆగ్నేయంగా 40 నాటికల్ మైళ్ల దూరంలో వారు చేపల వేట సాగిస్తున్నారు. ఆ సమయంలో వారిని చుట్టుముట్టిన లంక నావికాదళం, సరిహద్దులు దాటి చేపలు పడుతున్నారని వారిని మయిల్‌పట్టి ఫిషింగ్ హార్బర్‌కు తరలించి విచారణ అనంతరం పడవ సహా జాలర్లను జాఫ్నా మత్స్యశాఖ అధికారులకు అప్పగించారు. అధికారులు వారిని కోర్టులో హాజరపరచి రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించారు. కాగా, శ్రీలంక నావికాదళం అమానుషదాడులు అడ్డుకోవాలని, లంక జైళ్లలో ఉన్న జాలర్లు, స్వాధీనం చేసుకున్న పడవలు సత్వరం విడిపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని రాష్ట్ర జాలర్ల సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

డీకేఎం మహిళా కళాశాల 49వ స్నాతకోత్సవం



విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తున్న ముఖ్యఅతిథి మలర్

వేలూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీకేఎం మహిళా కళాశాల 49వ స్నాతకోత్సవం శనివారం జరిగింది. కార్యక్రమానికి కళాశాల అధ్యక్షుడు శివకుమార్ అధ్యక్షత వహించగా, కళాశాల ప్రిన్సిపాల్ భానుమతి ఆహ్వానం పలికారు. వేలూరు మండల కళాశాలల జాయింట్ డైరెక్టర్ మలర్ ముఖ్యఅతిథిగా పాల్గొని, 1137 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. అలాగే, 1 నుంచి 93వ ర్యాంకు సాధించిన విద్యార్థులకు మొత్తం రూ.2.19 లక్షల నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో మలర్ మాట్లాడుతూ... ప్రస్తుతం మహిళలు అధికంగా ఉన్నత విద్య అభ్యసిస్తున్నారని, పెరియార్ మహిళల చదువును ప్రోత్సహించారన్నారు. విద్యార్థులు ప్రస్తుతం సెల్‌ఫోన్ అధికంగా వినియోగిస్తున్నారని, సెల్‌ఫోన్ వాడకం తగ్గించి విద్యపై దృష్టి సారించాలని ఆమె పిలుపునిచ్చారు.

తాత్కాలిక డిగ్రీ టీచర్లకు డిసెంబరు వరకు వేతనం

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో తాత్కాలికంగా పనిచేస్తున్న 7,979 మంది డిగ్రీ టీచర్లకు డిసెంబరు 31వ తేది వరకు వేతనం అందించేందుకు అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ విషయమై పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి ఎస్.మధుమతి విడుదల చేసిన జీవోలో... ప్రభుత్వం ఉన్నత, మహోన్నత పాఠశాలల్లో 6,7,8 తగరగతులకు 40 విద్యార్థులకు ఒక టీచర్ చొప్పున 7,979 మంది డిగ్రీ టీచర్లను తాత్కాలికంగా నియమించారు. వీరి పదవీకాలం 2024 వరకు పొడిగించి సెప్టెంబరు 30వ తేది వరకు వేతనం అందజేశారు. ఈ క్రమంలో, డిగ్రీ టీచర్ల పదవీకాలం ఈ నెల 1 నుంచి డిసెంబరు 31వ తేది వరకు వేతనం అందజేయాలని జీవోలో పేర్కొన్నారు.

ప్లస్ టూ విద్యార్థులకు పోటీపరీక్షలపై శిక్షణ

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్లస్ టూ విద్యార్థులకు రాయాల్సిన పోటీ పరీక్షలపై శిక్షణ ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. తొలివిడతగా 15 జిల్లాల్లో శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రాంతీయస్థాయిలో 87 ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాలలను ఉన్నత విద్య మార్గదర్శక కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఈ కేంద్రాల్లో ప్రతి వారం శనివారాల్లో విద్యార్థుల కోరిక మేరకు కౌన్సెలింగ్, మార్గదర్శకాలు అందించనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ పాఠశాల ఉపాధ్యాయుల ద్వారా 'ఎమిస్‌లో పేర్లు నమోదుచేసుకోవచ్చు. శిక్షణకు వచ్చే విద్యార్థులు మధ్యాహ్న భోజనం తెచ్చుకోవాలి. మొదటి వారంలో 9 పోటీ పరీక్షలు, 2వ వారంలో 10 పోటీ పరీక్షలపై కోచింగ్ ఇవ్వనున్నారు.

ఆర్‌సీఎం పాఠశాల సర్వసభ్య సమావేశం



మాజీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నిర్వాహకులు

వేలూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్‌సీఎం పాఠశాలల ఉపాధ్యాయుల కూటమి తరపున వేలూరు, తిరువణ్ణామలై, రాణిపేట, తిరుపత్తూర్ జిల్లాల సర్వసభ్య సమావేశం, మాజీ ఉపాధ్యాయుల అభినందన కార్యక్రమం స్థానిక ఓ కల్యాణ మండపంలో జరిగాయి. కార్యక్రమానికి జిల్లా బిషప్ జాన్ రాబర్ట్ అధ్యక్షత వహించగా, జిల్లా ఆర్‌సీఎం పాఠశాలల మేనేజర్ గ్లామెంట్‌రోసారి పాల్గొన్నారు. ఆర్‌సీఎం పాఠశాలల అధ్యక్షుడు దళవేంద్రమ్ మాజీ ఉపాధ్యాయులు, బాగా పనిచేసిన ఉపాధ్యాయులను సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉప కార్యదర్శి కన్నిమేరి, కోశాధికారి మరియరాజన్, కార్యకర్తల కమిటీ సభ్యులు, జనరల్ కమిటీ సభ్యులు, ఆర్‌సీఎం ఉపాధ్యాయులు, సంఘ నిర్వాహకులు పాల్గొన్నారు.

సౌదీలో నర్సు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియా ఆస్పత్రుల్లో పనిచేసేందుకు మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు తమిళనాడు విదేశీ ఉద్యోగ అవకాశాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పవన్‌కుమార్ జి.కిరియప్పనవర్ విడుదల చేసిన ప్రకటనలో... రెండేళ్ల అనుభవంతో బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసిన 35 ఏళ్లలోపున్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పోస్టులకు ఇంటర్వ్యూలు నవంబరు 13 నుంచి 15వ తేది వరకు కొచ్చిన్‌లో నిర్వహించనున్నారు. మరిన్ని వివరాలకు 9566239685, 6379179200, 044-22505886 అనే నెంబర్లు, www.omcmanpower.tn.gov.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

మొక్కలతో వజ్రాసనం



వజ్రాసనంలో విద్యార్థులు

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా వాసుదేవనల్లూర్‌లో ఉన్న పాఠశాలలో ప్రపంచ రికార్డు నెలకొల్పేలా యోగా కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో 30 పాఠశాలలకు చెందిన వంద మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. రెండు గంటల సేపు చేతుల్లో మొక్కలు పట్టుకొని విద్యార్థుల వజ్రాసనం వేశారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్యరహిత తెన్‌కాశి జిల్లా, మొక్కల పెంపకం ఆవశ్యకత తదితరాలపై అవగాహన కల్పించేలా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆహారం వృథాను అరికట్టాలని ర్యాలీ



పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్‌లోని నెహ్రూ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ అండ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రేస్ కోర్స్ రోడ్డులో ప్రపంచ ఆహార దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ విద్య సంస్థల చీఫ్ నిర్వహణ అధికారి కృష్ణన్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రపంచంలోని పలు దేశాల్లో ఆహారం కొరత నెలకొందన్నారు. మనం వృధా చేసే ఆహారం ఆకలితో ఉన్న వారికి అమృతం వంటిదన్నారు. ఆహారాన్ని వృధా చేయరాదని పిల్లలకు తల్లిదండ్రులు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పలు రకాల ఆహార పదార్థాలు ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు.

కర్ణాటక రాష్ట్రానికి వరికోత యంత్రాలు



గూడ్సు రైలులో తరలిస్తున్న వరి కోత యంత్రాలు

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి జిల్లా చిన్న సేలం నుంచి గూడ్సు రైలు ద్వారా 110 వరికోత యంత్రాలు కర్ణాటక రాష్ట్రానికి పంపించారు. కర్ణాటక రాష్ట్రంలో వరి పంట కోత దశకు రాగా, తగినంత వరికోత యంత్రాలు లభించడం లేదు. కర్ణాటక రాష్ట్ర రైతుల విజ్ఞప్తితో తమిళనాడు వరికోత యంత్రాల యజమానుల అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రం సూరత్‌కల్ ప్రాంతానికి వరికోత యంత్రాలు తరలించారు. కళ్లకుర్చి, కరూర్, పెరంబలూరు, విల్లుపురం, సేలం, తిరువణ్ణామలై తదితర జిల్లాల నుంచి 110 వరికోత యంత్రాలను చిన్నసేలంకు తెప్పించి, అక్కడి నుంచి రైలు ద్వారా కర్ణాటక రాష్ట్రానికి పంపించారు. రెండు నెలలు ఈ యంత్రాలు కర్ణాటక రాష్ట్రంలో వరికోత చేపడతాయని అసోసియేషన్ నిర్వాహకులు తెలిపారు.

డీఎంకేలో చేరిన పలుపార్టీల నేతలు



ఎంపీ కదిర్ ఆనంద్ సమక్షంలో డీఎంకేలో చేరిన పలు పార్టీల నేతలు, కార్యకర్తలు

వేలూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి తాలూకాలో వేలూరు ఎంపీ కదిర్ ఆనంద్ నేతృత్వంలో పలుపార్టీల నేతలు డీఎంకేలో చేరారు. కార్యకర్తల సభ్యుడు ఏలుమలై, ప్రాంత సెక్రటరీ పరమశివం నేతృత్వంలో చేరిన వారిని, ఎంపీ కదిర్ ఆనంద్ శాలువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జేసీపీ సురేష్, నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.

1 నుంచి 'డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు'

పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పింఛన్‌దారులకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు అందించేలా నవంబరు 1వ తేది ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. పింఛన్‌దారులు ప్రతి ఏడాది లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంటుంది. అందుకోసం వారు బ్యాంకులు, కార్యాలయాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతుంటారు. ఈ సమస్య పరిష్కరించేలా 'జీవన్ ప్రమాణ్' ప్రాజెక్ట్ తపాలా శాఖ ఆధ్వర్యంలోని 'ఇండియా పోస్ట్ పేమెంట్స్' బ్యాంక్ ద్వారా పింఛన్‌దారుల ఇళ్లకే వెళ్లి వేలిముద్రలు సేకరించి, అక్కడే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు అందించనుంది. పింఛన్‌దారులు తమ ఇంటికి వచ్చే పోస్టల్ ఉద్యోగి ద్వారా ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ నెంబర్లు, పింఛన్ నెంబరు, బ్యాంక్ ఖాతా తదితరాలు నమోదు చేసి లైఫ్ సర్టిఫికెట్ పొందవచ్చు. చెన్నై మండల పరిధిలోని 2,194 తపాలా కార్యాలయాల్లో పనిచేస్తున్న 4,100 సిబ్బంది ద్వారా ఈ సేవలను నవంబరు 1 నుంచి పొందవచ్చని తపాలా శాఖ తెలిపింది.

హిందీలో లేఖ రాసిన కేంద్ర మంత్రి

● తమిళంలో బదులిచ్చిన డీఎంకే ఎంపీ అబ్దుల్లా



పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి హిందీలో రాసిన లేఖకు డీఎంకే ఎంపీ అబ్దుల్లా తమిళంలో బదులిచ్చారు. పుదుకోటకు చెందిన డీఎంకే ఎంపీ అబ్దుల్లా రైల్వే శాఖ అందిస్తున్న ఆహార పదార్థాల స్వచ్ఛత, నాణ్యతపై తదితరాలపై పార్లమెంటు సమావేశాల్లో పలు ప్రశ్నలు లేవదీశారు. ఇందుకు, రైల్వే శాఖ సహాయ మంత్రి నవనీత్ సింగ్, డీఎంకే ఎంపీ అబ్దుల్లాకు ఈ నెల 21న లేఖ రాశారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి లేఖ హిందీలో ఉన్నందున తనకు అర్థం కాలేదని ఎంపీ అబ్దుల్లా తమిళంలో బదులు లేఖ రాశారు. అందులో... నమస్కారం, క్షేమంగా ఉన్నారనుకుంటున్నాను. మీరు నాకు పంపిన లేఖ అందింది. నాకు హిందీ భాష రాని కారణంగా లేఖలో ఏం రాశారో నాకు తెలియలేదు. అందువల్ల మరోసారి నాకు లేఖ రాసే సమయంలో ఆంగ్లంలో పంపించాల్సిందిగా కోరుకుంటున్నాను అంటూ ఎంపీ తమిళంలో రాశారు. అలాగే, రెండు లేఖలను ఎంపీ తన ఎక్స్‌లో పోస్ట్ చేయడం గమనార్హం.

కీళడిలో పురావస్తు తవ్వకాలు పొడిగింపు

అడయార్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శివగంగై జిల్లా తిరుభువనం సమీపంలోని కీళడిలో పదో దశ పురావస్తు తవ్వకాల పనులను వచ్చే యేడాది మార్చి నెల వరకు పొడిగించారు. ఇక్కడ జూన్ నెల 18వ తేదీ జాతీయ పురావస్తు శాఖ అధికారులు తవ్వకాలు చేపట్టారు. సాధారణంగా భూగర్భ పురావస్తు తవ్వకాలు ఫిబ్రవరి నెలలో ప్రారంభించి సెప్టెంబరులో పూర్తి చేస్తారు. కానీ, తమిళనాడు పురావస్తు శాఖ జనవరి, ఫిబ్రవరి నెలల్లో ప్రారంభించాల్సిన తవ్వకాలు ఆలస్యంగా జూన్ నెలలో ప్రారంభించింది. కమిషనర్ శివానందం పర్యవేక్షణలో కీళడి భూగర్భ పురావస్తు విభాగం జాయింట్ డైరెక్టర్ రమేష్, సహాయ డైరెక్టర్ అజయ్, 50 మంది పురావస్తు విద్యార్థులు ఈ తవ్వకాల్లో పాల్గొన్నారు. సెప్టెంబరులో నిలిపివేయాల్సిన ఈ తవ్వకాలను వచ్చే యేడాది మార్చి నెల వరకు పొడిగించినట్లు జాతీయ పురావస్తు శాఖ అధికారులు వెల్లడించారు.

రైళ్లలో టపాసుల తరలింపుపై ప్రత్యేక నిఘా



పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బాణసంచా తరలింపును అడ్డుకొనేలా రైల్వేస్టేషన్లు, రైళ్ల లో రైల్వే పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. దీపావళి పండుగకు నాలుగు రోజులే ఉన్న నేపథ్యంలో,బాణసంచా,కొత్త దుస్తుల విక్రయాలు జోరందుకున్నాయి. రైళ్లలో అగ్నిప్రమాదాలు అడ్డుకొనేలా బాణసంచా,పేలుడు పదర్థాలు తీసుకెళ్లడంపై నిషేధం అమలులో ఉంది. ఈ క్రమంలో, ప్రస్తుతం రైల్వేస్టేషన్లు, రైళ్లలో బాణసంచా తరలింపును అడ్డుకొనేలా రైల్వే పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. రైల్వేస్టేషన్ల ప్రవేశద్వారం వద్ద ప్రయాణికుల లగేజీ స్కాన్ చేయడం, మెటల్ డిటెక్టర్లతో క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే అనుమతిస్తున్నారు. కాగా, రైళ్లలో బాణసంచా తరలిస్తే మూడేళ్ల జైలు, రూ.5,000 జరిమానా విధిస్తామని రైల్వే పోలీసు శాఖ హెచ్చరించిన విషయం తెలిసిందే.

సూర్య కెరీర్‌లోనే ది బెస్ట్ సినిమా 'కంగువా'

● శివకుమార్ | చిత్రజ్యోతి

తన కుమారుడు, హీరో సూర్య సినీ కెరీర్‌లోనే ది బెస్ట్ సినిమాగా 'కంగువా' ఉంటుందని 'కోలీవుడ్ మార్కండేయగా' గుర్తింపు పొందిన సీనియర్ నటుడు, సూర్య తండ్రి శివకుమార్ కితాబిచ్చారు. సిరుత్తై శివ దర్శకత్వంలో సూర్య - దిశా పటానీ జంటగా నటించిన చిత్రం 'కంగువా' తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ సహా పదికిపైగా భాషల్లో తెరకెక్కింది. స్టూడియో గ్రీన్ పతాకంపై బడా నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా ఈ చిత్రాన్ని నిర్మించారు. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ప్రతినాయకుడు. నవంబరు 14వ తేదీ ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నగరంలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ వేడుకకు చిత్ర బృందంతో పాటు శివకుమార్, కేఎస్ రవికుమార్, ఏఎల్ విజయ్, ఆర్‌జే బాలాజీ, కార్తీక్ సుబ్బరాజ్, శక్తివేల్, ధనుంజయన్, హీరో కార్తీ, ప్రముఖ హాస్య నటుడు యోగిబాబు, నటులు నట్టికుమార్, బోస్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ, 'నలుగురు మధ్య మాట్లాడేందుకు ఎంతో సిగ్గు, బెరుకుతో వణికిపోయే మా కుట్టిపయ్య (చిన్నోడు) ఇపుడు 'కంగువా' చిత్రంలో నటించాడు. కెరీర్ ఆరంభానికి ముందుకు కుటుంబ పోషణ కోసం అనేక పనులు చేశారు. అనేక మంది అనేక మాటలు అన్నారు. వాటినన్నింటినీ దిగమింగి, అంకితభావంతో ఈ స్థాయికి చేరుకున్నాడు. రెండు దశాబ్దాల సూర్య సినీ కెరీర్‌లో 'కంగువా' ది బెస్ట్ మూవీగా ఉంటుంది' అన్నారు. హీరో కార్తీ మాట్లాడుతూ, 'అభిమానులను సంతృప్తి పరిచేందుకు అన్న సూర్య చాలా శ్రమిస్తారు. ఆయన ఈ స్థాయికి చేరుకోవడం కారణం ఆయన అంకితభావమే అన్నారు. దర్శకుడు సిరుత్తై శివ మాట్లాడుతూ, 'లొకేషన్‌లో నేను ప్రశాతంగా, ఆత్మవిశ్వాసం, నిగ్రహం, ధైర్యంతో ఉంటానని ప్రతి ఒక్కరూ చెబుతుంటారు. దీనికి కారణం అగ్రహీరో అజిత్ కుమార్. ఆయనతో పనిచేసిన సమయంలో నన్ను అర్థం చేసుకుని ప్రోత్సహించిన తీరే నన్ను ఇలా నిలబెట్టింది. ఆ తర్వాత నా వద్ద పనిచేసే నలుగురు అసిస్టెంట్ దర్శకులు. ఆ నలుగురే 15 మంది అసిస్టెంట్ డైరెక్టర్లు చేసే పనిని రేయింబవళ్ళు శ్రమించి చేస్తారు. ఈ చిత్రం ఇంత గ్రాండ్‌గా వచ్చిందంటే దానికి కారణం ఆ నలుగురు అసిస్టెంట్ డైరెక్టర్లే. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చడానికి ప్రధాన కారణం నా స్నేహితుడు ఆదినారాయణ. రెండోది చిత్ర నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా. భారీ బడ్జెట్, పీరియాడిక్ చిత్రమైనా ఏమాత్రం వెనుకంజ వేయలేదు. జ్ఞానవేల్ రాజా నిర్మాతగా సిరుత్తై సినిమా తెరకెక్కించాను. అప్పటి నుంచి నా పేరు సిరుత్తై శివగా మారిపోయింది. 'కంగువా' తర్వాత మరో కొన్నేళ్ళ వరకు నా పేరు ఇండస్ట్రీలో నిలబడిపోతుందన్నారు. హీరో సూర్య మాట్లాడుతూ, 'ఈ చిత్రంలో విలన్‌గా బాబీ డియోల్ నటించడం మరిచిపోలేనిది. గొప్ప నటుడైనప్పటికీ ప్రతి ఒక్కరినీ కలిసిపోయారు. దేవీశ్రీ ప్రసాద్ సంగీతం సినిమాని మరో స్థాయికి తీసుకెళ్ళింది. ఇందులో నటించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అన్నారు. ఈ సందర్భంగా దేవీశ్రీ ప్రసాద్ ఆలపించిన పాట అభిమానులతో పాటు అహూతులను అలరించింది.



'కంగువా' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో శశికుమార్



సూర్య, బాబీ డియోల్, దిశా పటానీ, డీఎస్పీ, జ్ఞానవేల్, శివ, కార్తీ

మా దృష్టంతా 'గ్యాంగర్స్'పైనే

● ఖుష్బూ



ప్రస్తుతం తన భర్త, సినీ దర్శకుడు సుందర్ సి దృష్టంతా 'గ్యాంగర్స్' మూవీపైనే ఉందనీ, 'అరణ్మనై-5'కు సంబంధించిన సమాచారాన్ని ఆయన త్వరలోనే వెల్లడిస్తారని సినీ నిర్మాత, నటి ఖుష్బూ వెల్లడించారు. అవ్నీ క్రియేషన్స్ బ్యానరుపై సుందర్ దర్శకత్వంలో ఇప్పటివరకు "అరణ్మనై" సిరీస్‌లో నాలుగు చిత్రాలు వచ్చారు. గత మేలో 'అరణ్మనై-4' విడుదలై ఘన విజయం సాధించి, కలెక్షన్ల వర్షం కురిపించింది. ఈ నేపథ్యంలో ఈ సిరీస్‌లో ఐదో భాగాన్ని సుందర్ సి తెరకెక్కించనున్నారంటూ ఫస్ట్‌లుక్‌తో పాటు నటీనటుల వివరాలు సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ అవుతున్నాయి. వీటిపై ఖుష్బూ స్పందించారు. 'అరణ్మనై-5' ప్రాజెక్టుపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తలన్నీ కేవలం పుకార్లు మాత్రమే. ఐదో భాగం ఫస్ట్‌లుక్ ఇదేనంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టర్ కూడా ఫేక్. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పనులు ప్రారంభంకాగానే ప్రొడక్షన్ హౌస్ అవ్నీ క్రియేషన్స్ అధికారికంగా వెల్లడిస్తుంది. ప్రస్తుతానికి తమ దృష్టంతా 'గ్యాంగర్స్'పైనే ఉంది' అని ఆమె స్పష్టం చేశారు.

'నందన్' చిత్ర బృందానికి సూపర్‌స్టార్ ప్రశంసలు

శశికుమార్ హీరోగా నటించిన 'నందన్' చిత్రాన్ని తిలకించిన సూపర్‌స్టార్ రజనీకాంత్ ఆ చిత్ర బృందాన్ని ప్రశంసల్లో ముంచెత్తారు. ఇప్పటికే పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు ఈ చిత్రాన్ని చూసి యూనిట్ సభ్యులను అభినందించగా, తాజాగా సూపర్‌స్టార్ చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. సినిమా చూసిన రజనీకాంత్ హీరో శశికుమార్ దర్శకుడు ఐ.శరవణన్‌లకు స్వయంగా ఫోన్ చేసి అభినందించారు. ఈ విషయాన్ని హీరో శశికుమార్ తన ఇన్‌స్టా ఖాతాలో వెల్లడించారు. తమ సినిమా చూసిన తలైవర్ రజనీకాంత్ తమకు ఫోన్ చేసి ప్రశంసించడం ఎంతో సంతోషంగా, ఆనందంగా ఉందని పేర్కొన్నారు. గత నెలలో విడుదలైన ఈ చిత్రం ప్రస్తుతం ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుంది.



శశికుమార్, రజనీకాంత్

దళపతి నినాదాలతో దద్దరిల్లిన మహానాడు ప్రాంతం



విక్రవాండి రహదారిలో బారులు తీరిన కార్యకర్తలు

● 10కి.మీ.ల పొడవునా స్తంభించిన ట్రాఫిక్

చెన్నై, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) మహానాడులో ఆ పార్టీ నేత విజయ్ రాగానే లక్షలాది మంది కార్యకర్తలంతా ఒక్కసారిగా 'దళపతి.. దళపతీ' అంటూ నినాదాలు చేశారు. ప్రధాన వేదిక నుండి సభికుల నడుమ ఏర్పాటు చేసిన ర్యాంప్ మీదుగా విజయ్ నడిచి వెళ్తుండగా కార్యకర్తలంతా పార్టీ రంగుల తువ్వాళ్లను ఆయనపై విసిరేసి విజయ్ వర్థిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఇరువైపులా ఉన్న కార్యకర్తలకు నమస్కరిస్తూ మళ్ళీ ప్రధాన వేదికకు చేరుకున్నారు. ఇక ఈ మహానాడుకు వెళ్లే పార్టీ ప్రముఖులు, నేతలు, కార్యకర్తల వాహనాల కారణంగా విక్రవాండి సమీపంలో 10 కి.మీ.ల పొడవున ట్రాఫిక్ స్తంభించింది. ఆదివారం ఉదయం విక్రవాండి టోల్‌గేట్ సమీపం పాప్పన్‌పట్టు ప్రాంతం నుండి వి. సాలై ప్రాంతం వరకు రహదారిలో వాహనాలన్నీ నిలిచిపోయాయి. మహానాడు ప్రాంతంలో రెండు చోట్ల ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రాంతాలు వాహనాలతో నిండిపోయింది. రోడ్డుమీదనే వందల సంఖ్యలో వాహనాలను ఎక్కడికక్కడే నిలిపివేశారు. దీంతో ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధం చేసేందుకు తంటాలు పడ్డారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలంతా ఏడుకిలోమీటర్ల వరకు కాలినడకనే మహానాడు ప్రాంతానికి చేరుకున్నారు. ఇదే విధంగా చెన్నై - తిరుచ్చి రహదారిలో వందల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. విక్రవాండి ఒకటో నెంబర్ రహదారిలో ఈ మహానాడుకు వెళ్లే వాహనాలకు టోల్‌గేట్ రుసుము కూడా రద్దు చేశారు.



ముఖాలకు విజయ్‌ఫోటో మాస్కులు ధరించిన కార్యకర్తలు



తాంబరం వద్ద బోల్తాపడిన వ్యాన్, సొమ్మసిల్లిన కార్యకర్త

ముగ్గురి మృతి...

టీవీకే మహానాడులో పాల్గొనేందుకు వెళ్ళిన ముగ్గురు రోడ్డు ప్రమాదంలో మరణించారు. తిరుచ్చి నుండి ఆరుగురు వ్యక్తులు మహానాడులో పాల్గొనేందుకు కారులో వెళ్తుండగా, ఉలుందూరుపేట వద్ద కారు అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొంది. దీంతో టీవీకేకి చెందిన శీనివాసన్, కలై అనే ఇద్దరు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇదే విధంగా టీవీకే మహానాడులో పాల్గొనేందుకు చెన్నై తేనాంపేట నుండి ఇద్దరు పార్టీ కార్యకర్తలు వెళ్తున్న బైకును లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇక మహానాడులో పాల్గొనేందుకు తాంబరం నుండి శనివారం అర్ధరాత్రి 11మందితో బయల్దేరిన వ్యాన్ వేళచ్చేరి సంతోషపురం వద్ద బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 11 మంది గాయపడ్డారు. ఆ వ్యాన్ నడిపిన కార్తీక్ (25) తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నాడు. పళ్ళికరనై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

కట్టలు తెంచుకున్న ఉత్సాహం..

టీవీకే మహానాడులో పాల్గొనేందుకు ఒక రోజు ముందుగానే వెళ్ళి కార్యకర్తలు ఆదివారం వేకువజామున మహానాడు ప్రాంతం వద్ద అత్యుత్సాహం ప్రదర్శించారు. ఈ మహానాడులో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పుదుచ్చేరి నుంచి కూడా వేల సంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్ళారు. శనివారం రాత్రంతా ఆ మహానాడు ప్రాంతంలో ఎవరినీ అడుగుపెట్టనీయకుండా ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు కట్టుదిట్టంచేశారు. అయితే ఆదివారం వేకువజాము నైటీ డ్యూటీ చేసి బౌన్సర్లు వెళ్లిపోయారు. ఉదయం డ్యూటీ బౌన్సర్లు వేదిక వద్దకు రావడానికి కాస్త ఆలస్యమైంది. ఆ సమయంలో వేదిక వద్ద పోలీసులు కూడా లేరు. ఇదే అదనుగా భావించిన కార్యకర్తలు ఒక్కసారిగా ప్రధాన వేదికవైపు దూసుకెళ్ళారు. మహానాడు ప్రాంతం వద్ద సాధారణ కార్యకర్తలు, పార్టీ ప్రముఖులు, వీఐపీలు, మహిళలు కూర్చునేందుకు వేర్వేరు ప్రాంతాలను కేటాయించి కుర్చీలను వేసి ఉంచారు. ఇవేవీ పట్టించుకోకుండా వేల సంఖ్యలో ప్రధాన వేదికపై దూసుకెళ్ళారు. కార్యకర్తలంతా ప్రధాన వేదిక వద్ద వీఐపీల గ్యాలరీ అంతటా వేసి ఉన్నకుర్చీలలో తిష్ఠ వేశారు. ఆ తర్వాత అక్కడికి చేరుకున్న బౌన్సర్లు, పోలీసులు వారిని అక్కడి నుండి తొలగించేందుకు నానా తంటాలు పడాల్సి వచ్చింది.



మినీలారీపై కూర్చుని మహానాడుకు వెళుతున్న కార్యకర్తలు

ఎండలో సొమ్మసిల్లిన కార్యకర్తలు..

మహానాడు ప్రాంతంలో ఎండ వేడిమి అధికంగా ఉండటంతో కార్యకర్తలు తీవ్ర అవస్థలకు గురయ్యారు. పలువురు ఎండవేడి తట్టుకోలేక సొమ్మసిల్లిపోయారు. ఉదయం ఏడు గంటలకే మహానాడు ప్రాంతం వద్ద మూడు ప్రవేశ ద్వారాల గుండా కార్యకర్తలను అనుమతించారు. వీరిలో చాలా మంది 30 యేళ్లలోపు వారే అధికంగా కనిపించారు. యువతులు కూడా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఇక మహానాడు ప్రాంతం వద్ద తాగునీటి సదుపాయం లేకపోవడంతో కార్యకర్తలంతా చెమటతో అవస్థలు పడ్డారు. అదే సమయంలో పార్టీ నిర్వాహకులు కొందరు వాటర్ బాటిల్స్ పైకి విసరడంతో వాటిని పట్టుకునేందుకు కార్యకర్తలు నానాతంటాలు పడ్డారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

టీవీకే మహానాడు ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు పరైయాట్టం, దేవారట్టం, ఒయిలాట్టం, మయిలాట్టం అంటూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 27 మంది గ్రామీణ కళాకారులు ఈ ప్రదర్శనలు జరిపారు.

ముందు వరుసలో విజయ్ తల్లిదండ్రులు...

టీవీకే నేత విజయ్ తల్లిదండ్రులు శోభ, ఎస్సీ చంద్రశేఖర్ ఈ మహానాడులో పాల్గొనేందుకు ఆదివారం ఉదయమే విక్రవాండికి వెళ్ళారు. మహానాడు వేదికముందు వరుసలో వారు కూర్చుని మహానాడు కార్యక్రమాలను వీక్షించారు.



చెన్నైలోని అన్నా విశ్వవిద్యాలయం 45వ స్నాతకోత్సవంలో ఓ విద్యార్థినికి పట్టాప్రదానం చేస్తున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి



మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీలలో గెలుపొందిన విద్యార్థులతో ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తదితరులు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా శివకామి అమ్మవారి రథోత్సవం

చెన్నై, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం చిదంబరం నటరాజస్వామివారి ఆలయం శివగంగ పడమటి ఒడ్డున ఉన్న తిరుకామకోట్టం లోని శివకామి అమ్మవారి ఆలయంలో ఐప్పసి పూర ఉత్సవాలు ఈ నెల 19న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. శివకామి అమ్మవారి ఆలయంలో ఉన్న శిలాశాసనంలో శివకామసుందరి అమ్మవారి పేరును 'తిరుకామకోట్టముడయ పెరియ నాచ్చియార్' అని ఉండటం విశేషం. ఈ ఆలయం వెలుపలి ప్రాకారంలో చిత్రగుప్తుడు, నడుక్కుమ్ తీర్థ వినాయకుడు, ఆదిశంకరుడు, చక్రతాళ్వార్ వేర్వేరు సన్నిధుల్లో కొలువుదీరి ఉన్నారు. ఇంతటి విశేషాలను సంతరించుకున్న ఈ ఆలయంలో ప్రతియేటా శివకామసుందరి అమ్మవారికి ఐప్పసిపూర ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు ఈ నెల 19నుంచి అమ్మవారు ప్రతిరోజూ వివిధ వాహన సేవల్లో భక్తులను అనుగ్రహించారు. ఈ ఉత్సవాల్లో కీలక ఘట్టమైన రథోత్సవం ఆదివారం ఉదయం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. తూర్పు రథ వీధిలోని రథ మండప ప్రాంతం వద్ద శైవాగమ పండితులంతా మంత్రోచ్చారణ చేస్తుండగా రథంపై సర్వాలంకరణశోభితులైన అమ్మవారిని ఆశీనులు చేశారు. ఆ రథంలో అమ్మవారిని మాడ వీధుల్లో ఊరేగించారు. రథోత్సవం ముగిసిన తర్వాత సాయంత్రం యాగశాల పూజలు నిర్వహించి, అమ్మవారికి లక్షార్చన జరిపారు. సోమవారం పట్టుస్వీకరణ ఉత్సవం, పూరసలంగై ఉత్సవం, ఉత్సవమూర్తికి మహాభిషేకం, మహాదీపారాధన నిర్వహించనున్నారు. మంగళవారం రాత్రి శివానంద నాయకి సమేత సోమస్కంధర్ తిరుకల్యాణోత్సవం వైభవంగా జరుపనున్నారు. ఈ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను దీక్షితార్ల సంఘం నిర్వాహకులు చేపడుతున్నారు.



చెన్నై కలైవానర్ అరంగంలో ఏర్పాటైన సభలో ద్రావిడ భావజాల ఉపాధ్యాయ సంఘాన్ని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

కనుమరుగవుతున్న 'కామధేను' థియేటర్



పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఉన్న ప్రముఖ పాత సినిమా థియేటర్లలో ఒకటైన 'కామధేను' థియేటర్ కాలగర్భంలో కలసిపోయింది. మైలాపూర్, లజ్ కార్నర్‌లో ఉన్న ఈ థియేటర్ స్వాతంత్ర్యానికి పూర్వమే లక్ష్మి విలాస్ అనే పేరుతో నిర్మించారు. 1950లో ఆ థియేటర్ పేరును కామధేనుగా మార్చారు. ఆరంభంలో పాత చిత్రాలను ప్రదర్శిస్తుండగా, టిక్కెట్ ధరలు 6, 10, 15 అణాలుగా వసూలు చేశారు. దేశంలో పైసా పరిచయం చేసిన తర్వాత ఈ థియేటర్‌లో టిక్కెట్ ధర ఒక్క రూపాయి, రూ.1.50 పైసలు, రూ.2 చొప్పున వసూలు చేసేవారు. దివంగత మహానటులు ఎంజీఆర్, శివాజీ గణేశన్ వంటి పాతతరం నటుల చిత్రాలను ఎక్కువగా ప్రదర్శించారు. కామధేను థియేటర్‌ను కొన్నేళ్ళపాటు కల్యాణమండపంగా నిర్వహించారు. ఆ థియేటర్ ఆనవాళ్లు కూడా లేకుండా కూల్చివేశారు. ప్రస్తుతం ఆ స్థలంలో భవనసముదాయాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేపడుతున్నారు.



కాలుష్య రహిత సంప్రదాయ దీపావళి పండుగను జరుపుకునేలా అవగాహన కల్పిస్తూ చెన్నై అన్నానగర్ టవర్ పార్క్ వద్ద ఆదివారం రాత్రి వెయ్యి దివ్వెలతో భారతదేశ మ్యాప్ రూపొందించిన మీరా షాంపూ నిర్వాహకులు

తోటలో రెండు కిలోల పుట్టగొడుగు !



పెరంబూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ఉరుములు, మెరుపులు వచ్చినప్పుడు పుట్టగొడుగులు మొలకెత్తుతాయని చెబుతుంటారు. ఈ పుట్టగొడుగులను వండుకుంటారు. అలాగే, నగర ప్రాంతాల్లో కృత్రిమంగా పుట్టగొడుగులు పెంచి విక్రయిస్తుంటారు. పుట్టగొడుగులతో తయారుచేసిన ఆహార పదార్థాలు వివిధ వ్యాధుల నియంత్రణకు ఉపయోగపడతాయని పరిశోధకులు పేర్కొంటుండడంతో, ప్రజల్లో కూడా వీటిపై ఆసక్తి పెరిగుతోంది. ఈ నేపథ్యంలో, దిండుగల్ జిల్లాలో కొద్దిరోజులుగా భారీవర్షాలు కురుస్తున్నాయి. సెంగుళత్తుపట్టిలోని సుందర మహాలక్ష్మి అనే వ్యక్తికి సొంతమైన తోటలో 2 కిలోల భారీ పుట్టగొడుగు ఉండడం ఆయన కుమారుడు కెవిన్ గుర్తించాడు. ఈ భారీ పుట్టగొడుగును చూసేందుకు ప్రజలు పోటీపడ్డారు.

పద్యశిల్పానికి పరాకాష్ఠ విశ్వనాథ రామాయణ కల్పవృక్షం





వక్తను సత్కరిస్తున్న నిర్వాహకులు కందనూరు మధు, జేకే రెడ్డి- కార్యక్రమానికి హాజరైన తెలుగు ప్రముఖులు

డాక్టర్ జోస్యుల కృష్ణబాబు

వేళచ్చేరి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పద్య శిల్పానికి పరాకాష్ఠ విశ్వనాథ సత్యనారాయణ విరచిత రామాయణ కల్పవృక్షమని డా. జోస్యుల కృష్ణబాబు అన్నారు. నగరంలోని వేద విజ్ఞాన వేదిక ప్రతినెలా నిర్వహించే 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారావాహిక కార్యక్రమం ఆంధ్రా క్లబ్‌లోని కృష్ణా హాలు ఆదివారం సాయంత్రం జరిగింది.. ఈ 154వ ప్రసంగానికి వక్తగా తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురానికి చెందిన విశ్రాంతాచార్యులు డా.జోస్యుల కృష్ణబాబు హాజరయ్యారు. 'విశ్వనాథ వారి రామాయణ కల్పవృక్షం-పద్యశిల్పం' అనే అంశంపై ఆయన ఉపన్యసించారు. వేద విజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరు మధు సభకు స్వాగతం పలకగా, అరుణా శ్రీనాథ్ ప్రార్థనా గీతం ఆలపించారు. అనంతరం వేద విజ్ఞాన వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి వక్తను సభకు పరిచయం చేశారు. డా.జోస్యుల కృష్ణబాబు చదువులలో దిట్ట అని, పెద్దాపురం కళాశాలలో వివిధ హోదాల్లో పనిచేసి ఆచార్యులుగా పదవీవిరమణ చేశారు. అక్షర నేస్తం, తెలుగులో హరిశ్చంద్ర నాటకాలు ఇలా ఎన్నో రచనలు చేశారు. ఎన్నో సంస్థలు వీరిని సత్కరించారని, ఎన్నో పురస్కారాలు అందించారని వక్తను గురించి జేకే రెడ్డి తెలియజేశారు. ఆపైన కొన్ని తెలుగు పద్యాలను పాడి శ్రోతలను రంజింపజేశారు. అనంతరం కార్యనిర్వాహకులు వక్తను సత్కరించారు. అనంతరం జోస్యుల కృష్ణబాబు తన ప్రసంగంలో తెలుగు సాహితీ క్షేత్రంలో వేయి ఎకరాల భూస్వామి విశ్వనాథ అని ఓ కవి పలికారని, విశ్వనాథుల వారు అన్ని సాహిత్య ప్రక్రియలు స్పృశించారని, శతాధిక గ్రంథకర్త అని కొనియాడారు. తెలుగులో ఎన్నో రామాయణాలున్నాయని, ఎన్నో ప్రక్రియలో రాయబడిఉన్నాయని తెలిపారు. ఎందరో ఎన్ని విధాలుగా రామాయణాన్ని రాసినా ఎవరి అనుభూతి వారిదని, నా అనుభూతి నాదని, నా రచన నాదని అని విశ్వనాథ తెలిపారని వక్త పేర్కొన్నారు. నన్నయ భారతం, పోతన భాగవతం ఆ కవులు వాటిని కల్పవృక్షంతో పోల్చారని, విశ్వనాథ కూడా తన రామాయణాన్ని కల్పవృక్షంలాగా తీర్చిదిద్దే కోరికతో తన రామాయణానికి 'రామాయణ కల్పవృక్షం' పేరు పెట్టారని వక్త తన ప్రసంగంలో తెలిపారు. విశ్వనాథ కల్పవృక్షంలో చందో వైవిధ్యంతో పద్యాలు రచించారన్నారు. పద్య వైవిధ్యాన్ని రస సాక్షాత్కారం కోసం పాటించారని తెలిపారు. రామాయణ కల్పవృక్షంలోని పద్యశిల్పాన్ని వక్త ఎంతో విశదంగా వివరించారు. చివరగా వేద విజ్ఞాన వేదిక కార్యదర్శి మధు వందన సమర్పణగావించారు.

శ్రీరామమంత్ర యంత్ర యాత్ర ప్రారంభం



యంత్రానికి పూజలు చేస్తున్న శంకర విజయేంద్ర

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీరామమంత్ర యంత్ర యాత్ర ఆదివారం తిరుపతిలో ప్రారంభమైంది. వినాయకనగర్‌లోని కంచి మఠం వద్ద కంచి పీఠాధిపతి స్వామి శంకర విజయేంద్ర ఆ యంత్రానికి పూజలు నిర్వహించి, టీటీడీ జేఈవో వీరబ్రహ్మంతో కలిసి యాత్రను ప్రారంభించారు. విజయేంద్ర మాట్లాడుతూ కంచి ఆలయంలోని శ్రీరామమంత్ర యంత్రాన్ని పోలిన యంత్రాన్ని బంగారంతో తయారు చేయించి అయోధ్య ఆలయంలో యాగ పూజలో ఉంచుతామని తెలిపారు. ఇందులో భాగంగా తిరుపతి నుంచి ఈ మహామంత్ర యంత్రం ప్రత్యేక వాహనంలో బయలుదేరిందని, ఐదు రాష్ట్రాల మీదుగా 2వేల కిలోమీటర్లు ప్రయాణించి నవంబరు 17వ తేదీన అయోధ్య చేరుకుంటుందని వివరించారు. నవంబర్ 18 నుంచి 2025 జనవరి ఒకటి వరకు అయోధ్యలో లక్ష చండీ విశ్వశాంతి మహాయజ్ఞాన్ని నిర్వహిస్తామని తెలిపారు. శ్రీరాముడు జన్మించిన అయోధ్యకూ, కంచికీ పురాతన కాలం నుంచి సంబంధముందని, రాముల వారి జననం కోసం దశరథుడు కంచికి వచ్చి, వారం రోజులు అమ్మవారిని ప్రార్థించాడని తెలిపారు. ఈ నేపథ్యంలోనే అయోధ్యలో నిర్మించిన బాలరామాలయం వృద్ధిలోకి రావడానికి కంచి మఠం భక్తులు కృషి చేస్తున్నారని తెలిపారు. తిరుమల తరహాలో అయోధ్యలోనూ ధర్మం, దానం, తపస్సు వంటి హైందవ ధర్మ విధులు మరింత పటిష్ఠంగా నిర్వహించడానికి కంచి మఠం కృషి చేస్తోందన్నారు. తిరుపతి కంచి మఠం కేంద్రంలో ఆదివారం నుంచి ఆయుర్వేద చికిత్స కేంద్రం ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజక్టు సంచాలకులు విభీషణ శర్మ, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

వక్షోజ క్యాన్సర్‌పై అవగాహన కోసం

కావేరి ఆధ్వర్యంలో బైకథాన్ ర్యాలీ

చెన్నై, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో కావేరి హాస్పిటల్, ఉమెన్ మోటార్ స్పోర్ట్ క్లబ్ సహకారంతో ఆదివారం ఉదయం వక్షోజ క్యాన్సర్‌పై అవగాహన కల్పించేలా బైకథాన్ ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీలో 250 మంది మహిళలు బైకులను పింక్ రిబ్బన్ ఆకారంలో నడిపారు. ఈ ర్యాలీ ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకుంది. వడపళని కావేరి హాస్పిటల్ నుంచి నందనం వైఎంసీ మైదానం వరకూ బైకథాన్ ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖమంత్రి ఎం.సుబ్రమణ్యం, ఎంపీలు దయానిధి మారన్, తమిళచ్చి తంగపాండ్యన్, మేయర్ ఆర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కావేరి గ్రూప్‌ఆఫ్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్. హాస్పిటల్ రేడియేషన్ అంకాలజీ డైరెక్టర్ డాక్టర్ ఏఎన్ వైదీశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.



ఆసియా బుక్‌ఆఫ్ రికార్డ్స్ నిర్వాహకుల నుంచి ధ్రువీకరణ పత్రాన్ని స్వీకరిస్తున్న డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్, మంత్రి ఎం.సుబ్రమణ్యం

దీపావళి పండుగ ఎఫెక్ట్..

48 వేల మంది పోలీసులతో బందోబస్తు

● రాష్ట్రవ్యాప్తంగా నిఘా ● జోరందుకున్న టపాసులు, స్వీట్ల అమ్మకాలు



ప్యారీస్‌లో టపాసులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

ప్యారీస్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆనంద దీపావళి పండుగకు ఇక రెండు రోజులే ఉన్న నేపథ్యంలో, నూతన వస్త్రాలు, టపాసులు, స్వీట్లు, ఆభరణాల కొనుగోలుకు పెద్దసంఖ్యలో వస్తున్న వారితో వీధులు కిటకిటలాడుతున్నాయి. కొనుగోలుదారుల రద్దీ క్రమక్రమంగా పెరుగుతుండడంతో రాజధాని నగరం చెన్నై సహా మిగతా ప్రధాన నగరాల్లో పోలీసు శాఖ భద్రత పటిష్ఠం చేసింది. పండుగ రోజుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా 48వేల మంది పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొననున్నారు.

ఆదివారం ఉదయం నుండే వస్త్ర, బాణాసంచా, మిఠాయి దుకాణాలన్నీ జాతరను తలపించాయి. టీనగర్ రంగనాథన్ వీధి కొనుగోలుదారులతో కిటకిటలాడింది. అదే విధంగా ప్యారీస్, పురుషవాక్కం, సైదాపేట, నుంగంబాక్కం, అడయార్, డౌటన్, పెరంబూర్ తదితర ప్రాంతాల్లో కూడా కొనుగోలుదారుల సందడి నెలకొంది. తిరుచ్చి, మదురై, తిరునల్వేలి, తూత్తుకుడి, కన్నియాకుమారి తదితర ప్రధాన నగరాల్లో సంత వీధుల్లో భద్రత కట్టుదిట్టం చేశారు. పలు ప్రాంతాల్లో మఫ్టీలో పోలీసులు ప్రజల కదలికలు పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు దీపావళి వస్తువులు కొనుగోలుకు వస్తున్న ప్రజలు తమ వాహనాలను పార్కింగ్ చేసుకొనేందుకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు సిద్ధం చేశారు. వాచ్‌టవర్ల ద్వారా, డ్రోన్ కెమెరాలతో అనునిత్యం నిఘా వేస్తున్నారు. తల్లిదండ్రులతో షాపింగ్‌కు వెళ్లే పిల్లల చేతికి ఇంటి చిరునామా, సెల్‌ఫోన్లతో కూడిన బాడ్జ్ కడుతున్నారు. రద్దీ ప్రాంతాల్లో లౌడ్‌స్పీకర్ల ద్వారా ప్రజలను అప్రమత్తంగా ఉండాలంటూ అడుగడుగునా హెచ్చరికలు జారీచేస్తున్నారు. 108 అంబులెన్స్‌లు, ఫైరింజన్లను కూడా పలుచోట్ల అందుబాటులో ఉంచారు.



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న రంగనాథన్ వీధి

ప్రతి పరీక్షలోనూ

ఉదయనిధికి 100 మార్కులే

కితాబిచ్చిన ముఖ్యమంత్రి స్టాలిన్



అరివాలయం వద్ద వక్తృత్వ పోటీలలో బహుమతులు అందుకున్న విద్యార్థినులతో ముచ్చటిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తాను వివిధ రకాల పరీక్షలు పెట్టినా నూటికి 100 మార్కులతో పాసవుతున్నాడని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కితాబునిచ్చారు. అన్నా అరివాలయంలో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి వేడుకల ముగింపు సందర్భంగా ఆదివారం ఉదయం ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలు, కళాశాలలకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ పోటీలలో గెలిచిన వందమందికి బహుమతులు ప్రదానం చేశారు. 182 మంది విద్యార్థినీవిద్యార్థులు ఆయన చేతులమీదుగా కానుకలు స్వీకరించి ఆయనతో ఫోటో తీసుకున్నారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ డీఎంకే యువజన విభాగం నేతగా, మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా ఉదయనిధి స్టాలిన్ సమర్థవంతంగా పనిచేస్తున్నాడని ప్రశంసించారు. యువతను డీఎంకే సిద్ధాంతాల వైపు మళ్లించి వారికి పార్టీలో పదవులిచ్చి మరీ ఉదయనిధి పార్టీని కూడా కంటికి రెప్పలా కాపాడగలుగుతున్నాడిన పేర్కొన్నారు. పార్టీలో యువజన విభాగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తామని, యువకులే పార్టీ పట్టుగొమ్మలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, మంత్రులు దురైమురుగన్, పొన్ముడి, పెరియసామి డీఎంకే ఎంపీలు కనిమొళి, టీఆర్‌బాలు, తిరుచ్చి శివా తదితరులు పాల్గొన్నారు.



సీఎం స్టాలిన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తదితరులు

డాక్టర్ ఆదిజ్యోతిబాబు పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో అతిథులు, నిర్వాహకులు

అడయార్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆకుపంక్చరిస్ట్ డాక్టర్ ఆదిజ్యోతి బాబు రచించిన ""Know Disease - No Disease'' అనే పుస్తకాన్ని మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.జగదీశన్ ఆవిష్కరించారు. ఆదివారం నగరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తర చెన్నై ఎంపీ. డాక్టర్ ఏ కళానిధి వీరాస్వామి, ప్రముఖ వైద్యుడు డాక్టర్ సీఎంకే రెడ్డి, సైంటిస్ట్ డాక్టర్ వి.పొన్‌రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆదిజ్యోతి బాబు 'నాన్ మెడికల్ పంచభూత చికిత్స' విధానానికి వరల్డ్ రికార్డ్స్ యూనియన్ గుర్తింపు లభించింది. ఈ యూనియన్ అఫీషియల్ రికార్డ్స్ ఆఫీసర్ క్రిస్టోఫర్ టైలర్ క్రాఫ్ట్ హాజరయ్యారు. ఈ సందర్భంగ డాక్టర్ ఆదిజ్యోతిబాబు మాట్లాడుతూ 'శారీరక, మానసిక, జీవిత సంబంధిత వ్యాధులైన అక్యూట్, దీర్ఘకాలిక, అంతుచిక్కని వ్యాధులు, వంశపారంపర్య వ్యాధులు, వైద్య, ఆక్యుపంక్చర్ పుస్తకాల్లో లేని అనేక విషయాలను తన పుస్తకంలో పొందుపరిచినట్టు పేర్కొన్నారు.

డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో

దీపావళి కానుకలు



పాండీబజార్ వాసులకు దీపావళి కానుకలు అందజేస్తున్న సునీల్ తదితరులు

అడయార్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామికి విశ్వాసపాత్రుడైన అన్నాడీఎంకే ఎంజీఆర్ యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ సునీల్ దీపావళి పండుగను పురస్కరించుకుని, దక్షిణ చెన్నై, నార్త్ వెస్ట్ జిల్లా పాండిబజారులో 600 మందికి దీపావళి కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని 136వ విభాగం పార్టీ నిర్వాహకుడు ఎస్ఆర్ సూర్య రమేష్ ఏర్పాటు చేయగా, ఇందులో పాల్గొన్న డాక్టర్ సునీల్ టపాసులు, స్వీట్లుతో పాటు వివిధ రకాలైన కానుకలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నిర్వాహకులు ఎస్.సురేష్ కుమార్, ఎస్.సతీష్ కుమార్, వి.ప్రకాష్, మల్లికామణి, జి.వరలక్ష్మి, కె.కస్తూరి, ఆర్. కళా రమేష్, ఎం.మురళి, ఐ.శరవణన్‌తో సహా అనేక మంది పార్టీ కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.